ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai), ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

WWW.GAYATHRINEWS.COM

# గాయత్రి న్యూస్

APTEL/26/A3646

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ గురువారం 28-05-2026 సంపుటి : 1 సంచిక :04 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## గోదావరిలోకి పరిశ్రమ వ్యర్థాలు.. డిప్యూటీ సీఎం పవన్ ఆగ్రహం

### పర్యటనలో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

- గోదావరిలో పరిశ్రమ వ్యర్థాలపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆగ్రహం
- వెంకటనగరం వద్ద ఆంధ్రాపేపర్ మిల్స్ ప్రాంతాన్ని పరిశీలించిన పవన్
- గోదావరిలోకి నేరుగా కలుస్తున్న కాలుష్య వ్యర్థాలు గుర్తింపు
- కలుషిత నీటి నమూనాలు సేకరించి పరీక్షలకు ఆదేశం
- వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచన
- గోదావరి కాలుష్య నివారణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ప్రకటన



రాజమహేంద్రవరం: పవిత్ర గోదావరిలో కాలుష్య నివారణకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రంగంలోకి దిగారు. తూర్పుగోదావరి జిల్లాలో రెండో రోజు పర్యటనలో భాగంగా వెంకటనగరం వద్ద ఆంధ్రాపేపర్ మిల్స్ కాలుష్య వ్యర్థాలు గోదావరిలో కలిసే ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ వ్యర్థాలు నేరుగా గోదావరిలో కలస్తుండటంపై డిప్యూటీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని అధికారులను ఆదేశించారు. వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని, ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. గోదావరి కాలుష్య నివారణకు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్టు పవన్ ఇప్పటికే ప్రకటించారు. డిప్యూటీ సీఎం వెంట మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, స్థానిక ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి తదితరులు ఉన్నారు.

## దేశంలోకి చొరబాట్లు..

### అక్రమ వలసదారులపై ఉన్నతస్థాయి కమిటీ



అక్రమ వలసలు, ఇతర కారణాల వల్ల దేశంలో చోటుచేసుకుంటున్న అసహజ జనాభా మార్పుల ను నియంత్రించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనిపై దర్యాప్తు జరిపేందుకు ఓ ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. గతంలో ప్రధాని మోదీ ప్రకటన ఆధారంగా రిటైర్డ్ జడ్జి నేతృత్వంలో దీనిని ఏర్పాటు చేశామన్నారు.

- అక్రమ వలసలు, చొరబాట్లపై కేంద్రం కీలక చర్యలు
- జనాభా మార్పులపై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటు
- రిటైర్డ్ జడ్జి జస్టిస్ ప్రకాష్ నావోలేకర్‌కు కమిటీ బాధ్యతలు
- సభ్యులుగా దుర్గా శంకర్ మిశ్రా, బాలాజీ శ్రీవాస్తవ, డా. షమికా రవి
- దేశ భద్రత, సార్వభౌమత్వానికి జనాభా మార్పులు సవాల్: అమిత్ షా
- మత, సామాజిక వర్గాల జనాభా మార్పులపై సమగ్ర అధ్యయనం
- అక్రమ చొరబాట్ల నివారణలో రాష్ట్రాలు సహకరించాలని కేంద్రం పిలుపు

## ఇకపై మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తాం: మంత్రి నారా లోకేశ్ కీలక ప్రకటన



తెలుగుదేశం పార్టీలో ఇకపై మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తామని తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు నారా లోకేశ్ (ట్వీటుతీు రాశీఎవంష్ప్ర) కీలక ప్రకటన చేశారు. పార్లమెంట్‌లో బిల్లు పాసైనా... అవ్వకపోయినా పార్టీ తరఫున వచ్చే ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తామని వెల్లడించారు. బిగ్ అనౌన్స్‌మెంట్ అని ఉదయం పెట్టిన పోస్టుకు అనుగుణంగా తన ప్రసంగంలో మహిళలకు రిజర్వేషన్ అంశాన్ని నారా లోకేశ్ ప్రకటించారు.

## జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసం



ప్రజలు పెట్టుకున్న నమ్మకం, పార్టీ సృష్టించిన చరిత్ర నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని అధినేత చంద్రబాబు స్పష్టంచేశారు.

జాతీయ జెండా దేశానికి గౌరవం.. పసుపు జెండా తెలుగువారి ఆత్మవిశ్వాసమని తెదేపా అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. రెండ్రోజుల పాటు జరిగే మహానాడు ప్రారంభం సందర్భంగా ఆయనమాట్లాడారు. మహానాడుకు వాహనాల జోరు తగ్గింది కానీ శ్రేణుల్లో జోష్ తగ్గలేదన్నారు. 1875 క్లస్టర్లలో తొలిరోజే లక్షలాది మంది పాల్గొని అదరగొట్టారన్నారు. సంస్కరణలకు, విజన్ పాలిటిక్స్‌కు నాంది తెలుగుదేశమని తెలిపారు. దేశ రాజకీయాలకు దిక్సూచిగా నిలిచిన పార్టీ తెదేపా అని కొనియాడారు. జాతీయ రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిశీచిన ఏకైక ప్రాంతీయ పార్టీ మనదని గుర్తుచేశారు. పార్టీ పుట్టుక, ఎన్నిక, ప్రభంజనం అన్నీ సంచలనాలేనన్నారు.

మహిళా రిజర్వేషన్లు సాధించి చరిత్ర తిరగరాస్తామని ధీమా వ్యక్తంచేశారు. కూడు, గూడు నీడ లాంటి సంక్షేమ విధానాలతో తెదేపా ఆవిర్భవించిందని గుర్తుచేశారు. 45 ఏళ్లుగా ప్రజా సమస్యలపై తెదేపా పోరాటం చేస్తూనే ఉందన్నారు. దాడులు, హింస, హత్యా రాజకీయాలు, అక్రమ కేసులు, వేధింపులు వచ్చినా ప్రజా పోరాటాలు ఆపలేదని గుర్తుచేశారు. నరహంతకులు పీకలు కోస్తున్నా.. తెదేపా కార్యకర్తలు పార్టీ జెండాను వీడలేదని చంద్రబాబు అన్నారు. ఎన్నికల్లో భాజపా, జనసేనతో కలిసి కూటమిగా ఏర్పడి రాష్ట్ర పునర్నిర్మాణం కోసం పనిచేస్తున్నామన్నారు.

## పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములు



"తొలిదశలో హైదరాబాద్‌లో లక్ష ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీనికి అవసరమైన కార్యాచరణ కోసం క్షేత్రస్థాయిలోకి వెళ్లాం. 13 చోట్ల స్థలాలు పరిశీలించాం. జీహెచ్ఎంసీలో స్థలం కొరతతో 18వేల ఇళ్లే ఇచ్చాం. పేదల ఇళ్ల కోసం విలువైన ప్రభుత్వ భూములను కేటాయిస్తున్నాం.

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ కార్యక్రమం చేపడతామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే సుమారు లక్ష ఇళ్ల నిర్మాణం పూర్తయిందని చెప్పారు. జూన్ చివరి నాటికి మరో లక్ష పూర్తవుతాయన్నారు.

## రూ.వెయ్యి కోట్ల స్కామ్..

### ప్రభుత్వ భూములు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టారు: హరీశ్‌రావు



- రూ.వెయ్యి కోట్ల భూ స్కామ్ జరిగిందని హరీశ్‌రావు ఆరోపణ
- పెద్దషాపూర్‌లో 170 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటుకు కట్టబెట్టారన్న విమర్శ
- ఆర్డీవో నివేదికకు విరుద్ధంగా తహసీల్దార్ పట్టా భూమిగా నమోదు చేశారన్న ఆరోపణ
- తహసీల్దార్‌ను బదిలీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు
- భూభారతిలో రాత్రికి రాత్రే ఎంట్రీలు చేశారని ఆరోపణ

## రూ.4 లక్షల కోట్లకు చేరువలో భారత అంతరిక్ష పరిశ్రమ



## శిరాజ్‌సింగ్ అప్నాపన్ పుస్తకావిష్కరణ

### ఆవిష్కరించిన మాజీ ప్రధాని దేవేగౌడ వెంకయ్య తదితర ప్రముఖుల హాజరు



# పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణ, నిర్వాసితుల పరిహారంలలో అవినీతికి పాల్పడితే క్రిమినల్ చర్యలు

**- ఫిర్యాదులను ఆధారాలతో 9491041188, 18002331077, 08812224519 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయవచ్చు**

**- అవినీతికి సంబంధించి ఫిర్యాదులపై విచారణ చేసి తక్షణమే చర్యలు తీసుకుంటాం...ఫిర్యాదీదారుల వివరాలు గోప్యంగా ఉంచుతాం**

**- పోలవరం ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోంది**

**- ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి**

**- పోలవరం ప్రాజెక్ట్, రహదారుల భూసేకరణ, నిర్వాసితుల పరిహారం పంపిణీలపై అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్**

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

పోలవరం ప్రాజెక్ట్ భూ సేకరణ, నిర్వాసితులకు పరిహారం, తదితర అంశాలలో అవినీతికి పాల్పడేవారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్



నుండి బుధవారం పోలవరం ప్రాజెక్ట్ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి, భూసేకరణ, రహదారులు, ప్రభుత్వ ప్రాజెక్ట్ ల భూసేకరణపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన పోలవరం ప్రాజెక్ట్ ను త్వరితగతిన పూర్తిచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తున్నదని, ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించిన అర్హులైన నిర్వాసితులందరికీ పునరావాస పరిహారం పూర్తి స్థాయిలో అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ భూసేకరణ, ఆర్ అండ్ ఆర్ పరిహారం అందించడం, నిర్వాసితుల గుర్తింపు, నిర్వాసితులకు గృహాల నిర్మాణం, తదితర పనులలో కొందరు అవినీతికు పాల్పడుతున్నట్లు తనకు ఫిర్యాదులు అందుతున్నాయని, ఇది తీవ్రమైన విషయమన్నారు. అవినీతికి పాల్పడే వారి వివరాలను ఆధారాలతో సహా 9491041188, 18002331077, 08812224519 నెంబర్ల కు ఫిర్యాదు చేసిన వెంటనే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. ఫిర్యాదీదారుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఫిర్యాదును విచారణ చేసి, బాధ్యులపై తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చెప్పారు. నిర్వాసితులు ఫిర్యాదు చేయవలసిన నెంబర్ పై ఆయా గ్రామాలలో విస్తృత ప్రచారం నిర్వహించాలని, తహసీల్దార్ కార్యాలయాలతోపాటు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద ఫోన్ నెంబర్ తో ఫ్లెక్స్ లు ఏర్పాటుచేయాలన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితులకు భూసేకరణ పూర్తి అయి చేపట్టిన 1443 ఇళ్ళలో జూన్, రెండవ వారానికి 50 శాతం ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గృహ నిర్మాణ అధికారి సత్యనారాయణ ను కలెక్టర్ ఆదేశించారు. పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి సంబందించి పునరావాస ప్యాకేజి అందవలసిన అర్హులైన నిర్వాసితుల వివరాలను వెంటనే అందించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో చేపట్టిన రహదారుల పనులు, రైల్వే ఓవర్ బ్రిడ్జి లు, సెల్ టవర్ల కు సంబంధించి భూ సేకరణ పనులను వెంటనే పూర్తిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ అభిషేక్, ఐటిడిఆ పిఓ రాములు నాయక్, ఆర్డీఓ లు కె. లక్ష్మి ప్రసన్న, రమణ, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ సమస్యల అర్జీలను వెంటనే పరిష్కరించాలి

**- జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ**

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



జిల్లాలో 22ఏ భూ సమస్యలపై అందిన అర్జీలను పరిశీలించి నిబంధనల మేరకు ఉన్న అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డా. ఎం.జె. అభిషేక్ గౌడ అధికారులను ఆదేశించారు. పెదపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం జేసీ ఆకస్మికంగా తనిఖీ చేసి పిజిఆర్ఎస్ , 22ఏ భూ సమస్యలపై అందిన అర్జీల పరిష్కారం, రీసర్వే, జనగణన, పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ, తదితర అంశాలను తీసుకున్న చర్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ అభిషేక్ గౌడ మాట్లాడుతూ 22ఏ భూ సమస్యలపై అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ నెలలో పంపిణీ చేయవలసిన పట్టాదార్ పాస్ పుస్తకాలకు సంబంధించి రైతుల వివరాలు, విస్తీర్ణం, తదితర అంశాలపై సమాచారం సిద్ధం చేసుకుని, పట్టాదార్ పాస్ పుస్తకాల ప్రచురణకు ముందు వివరాలను సరిచూసుకొని, జూన్ నెలకు సంబంధించి పట్టాదార్ పాస్ పుస్తకాలు పంపిణీకి చర్యలు తీసుకోవాలని జేసీ మండల సిబ్బందిని ఆదేశించారు. ఇండ్లగణన కార్యక్రమాన్ని వెంటనే పూర్తిచేయాలని, పిజిఆర్ఎస్ లో అందిన అర్జీలను క్షేత్రస్థాయిలో పర్యటించి, అర్జీదారులను కలిసి వివరాలు తెలుసుకుని నిబంధనల మేరకు నిర్దేశించిన సమయంలోగా అర్జీలను పరిష్కరించాలన్నారు. తహసీల్దార్ కె. కృష్ణ జ్యోతి, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ , రెవిన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

# భూగర్భ జలాలను పెంచవలసిన బాధ్యత మనందరిపై ఉంది

**- అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు అయినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి**

**- లీకేజీలు నివారణ, ఇంకుడు గుంతలు ఏర్పాటు, నీటి సంరక్షణే ప్రధాన లక్ష్యంగా పనిచెయ్యాలి**

**- జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి ...**

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

పెదవేగి మండలం జగన్నాధపురం గ్రామంలో బుధవారం రెండు ఇంజక్షన్ రీఛార్జీ వెల్స్ ను, ఒక ఫిజియో మీటరును పరిశీలించి, ఫిజియో మీటరు నుండి టెలిమీటరు ద్వారా భూగర్భ జలాలు మట్టములను స్వయంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి పరిశీలించారు. అనంతరం స్వర్ణవార్డు సచివాలయంలో అధికారులు, రైతులతో సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టరు నిర్వహించారు. రైతులు కోరిక మేరకు జగన్నాధపురం గ్రామంలో చింతగుంట నుండి పొదూరు చెరువు వరకూ, రావులగుంట చెరువు నుండి చింతలగుంట చెరువు వరకూ ఫీడర్ ఛానల్ పనులకు రూ 50 వేలు రూపాయలను జిల్లా కలెక్టరు తక్షణం మంజూరు చేశారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో భూగర్భజలాలు స్థాయిని శాస్త్రీయంగా అంచనాను స్వయంగా పరిశీలించామని తెలిపారు. భూగర్భజలాలు స్థాయి నిరంతరం తగ్గిపోతున్న నేపథ్యంలో వాటిని కాపాడుకోవడం అత్యంత అవసరమని తెలిపారు. జిల్లాలో 72 ఫిజోమీటర్ల నుండి టెలిమీటర్ల ద్వారా భూగర్భ జలమట్టాన్ని ఎప్పటికప్పుడు కొలవడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ మాసంలో జిల్లాలో భూగర్భజలాలు మట్టములు సరాసరి 21.28 మీటర్లు, పెదవేగి మండలంలో 27.92 మీటర్లు ఉందని తెలిపారు. ఈ రోజు జగన్నాధపురంలో పిజోమీటర్ల నుండి టెలిమీటర్ల ద్వారా కొలవగా 25.26 మీటర్లు ఉందని, 3-6 మీటర్లు వాటరు లెవెల్స్ ను పెంచుటకు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించామని తెలిపారు. జలమట్టాన్ని క్రమం తప్పకుండా పరిశీలించడం ద్వారా భవిషత్తు నీటినిర్వహణకు సమగ్రప్రణాళికలు రూపొందించ వచ్చునని పేర్కొన్నారు. జిల్లాలో గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పిజియోమీటర్లను నిరంతరం పర్యవేక్షించాలని, సేకరించిన డేటా అనుగుణంగా భూగర్భజలాలు స్థాయిని పెంచుటకు చర్యలు చేపట్టాలని ఇందుకు నిధులు కొరతలేదని స్పష్టం చేశారు. భూగర్భజలాలు పెంపుదలకు ప్రతి పౌరుడు సామాజక బాధ్యతగా స్వీకరించాలని అన్నారు. నీటి వనరులు సంరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించినప్పుడే నాణ్యతా ప్రమాణాలతో మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. వర్షపునీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకిపోయాలా చర్యలు తీసుకోవాలని, ప్రతి ఇంటిలో



వర్షపు నీటిసంరక్షణ పద్ధతులను అమలు చెయ్యాలని సూచించారు. చెరువులు, కాలువలు, కుంటలను పరిరక్షించడం ద్వారా భూగర్భ జలాలు మట్టం పెరుగుతుందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, నీటి వినియోగంలో మితవ్యయం పాటించడం ఎంతో అవసరమని అన్నారు. గ్రామాలు, పట్టణాల్లో ప్రజలు భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. భవిషత్తు తరాలకు తగిన నీటి వనరులు అందుబాటులో ఉండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టరు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రౌండు వాటరు డిడి పైలా కోదండరామ్, సహాయ హైడ్రోజియాజిస్ట్ యు. చిరంజీవి, ఇరిగేషన్ సహాయక ఇంజనీరు కె.లాజరుబాబు, టెక్నికల్ సిబ్బంది, సీనియరు రైతు పర్వతనేని బాలగంగాధర్ (బాబ్జీ), స్థానిక రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలోని పలుక్లస్టర్లలో "మహానాడు"వేడుకలు

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



ఉంగుటూరు నియోజకవర్గంలోని క్లస్టర్5,6 పరిధిలో జరుగుతున్న హైబ్రిడ్ మహానాడు లో జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,ఏలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ముఖ్యఅతిథిగా హాజరై నందమూరి తారక రామారావు చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఏలూరులోని పలు తీర్మానాలను వర్చువల్ విధానంలో ఆమోదించారు.అదేవిధంగా పోలవరం నియోజకవర్గంలోని కుక్కునూరు మండల కేంద్రము పరిధిలో ఉన్న క్లస్టర్ లో టిడిపి మండల అధ్యక్షులు ములిశెట్టి నాగేశ్వరరావు పలు అభివృద్ధి కార్యక్రమాలు, నిర్వాసితుల సమస్యల సాధనకు కృషి చేస్తామని ఎన్టీఆర్ చిత్రపటం ముందు ప్రమాణం చేశారు. కివ్వాకలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ మహానాడు కార్యక్రమం రెండో రోజు మహానాడు వేదిక వద్ద నుండి ర్యాలీ గా బయలుదేరి కుక్కునూరు రామాలయం సెంటర్ లో ఉన్న తెలుగుదేశం పార్టీ జెండాను ఆవిష్కరించి, స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి ని పురస్కరించుకొని కివ్వాక గ్రామం లో గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఎన్టీరామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం, జెండా ఆవిష్కరణ కార్యక్రమం లో నియోజకవర్గ కన్వీనర్, ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు, నియోజకవర్గ పరిశీలకులు ముఖ్య అతిథి లు గా పాల్గొని కుక్కునూరు మహానాడు వేదిక వద్ద కి వచ్చి హైబ్రిడ్ విధానం లో రెండో రోజు జరిగే మహానాడు కార్యక్రమం తిలకించి వేదిక దగ్గర వివిధ పార్టీ ల నుంచి తెలుగుదేశం పార్టీలో కి వచ్చే వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు.వేదికవద్ద ఏర్పాటు చేసిన భోజనాలు స్వీకరించి కార్యక్రమం జయప్రదం చేయవలసిందిగా ములిశెట్టి నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి సత్యనారాయణ, సీనియర్ నాయకుడు కోటగిరి సత్యనారాయణ, రమణ రాజు, పులి శ్రీనివాసరావు, ఎలమందల కృష్ణార్జున రావు, మాజీ ఎంపీపీ మాచర్ల గంగరాజు, శేఖర్,మస్తాన్, మాచర్ల వెంకటేశ్వర్లు, కరేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన అనేది దేశ భవిష్యత్తుకు దిక్సూచి

**- గృహాలు గణనను 24 గంటల్లోగా పూర్తిచేసి, పూర్తిస్థాయిలో నివేదిక అందించాలి**

**- ఇంటింటికి వెళ్లి జనగణన వెరిఫికేషన్ చేపట్టిన జిల్లా కలెక్టర్**

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

పెదవేగి మండలం జగన్నాధపురం గ్రామంలో బుధవారం జనగణన ఇంటింటికి జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి స్వయంగా వెళ్ళి వెరిఫై చేశారు. అనంతరం స్వర్ణగ్రామ సచివాలయంలో సంబంధిత అధికారులు, స్వర్ణగ్రామ ఉద్యోగులతో జిల్లా కలెక్టరు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ చేసుకున్నవారు, మేము ఇంటికి వెళ్ళినప్పుడు ఐడి నెంబరు ఇవ్వక పోవడంతో, మేము నార్మల్ సెన్సస్ చేశామని, ఇప్పుడు ఐడిలు తక్కువగా ఉన్నాయని చెప్పడంతో జిల్లా కలెక్టరు ఆగ్రహం వ్యక్తం చేశారు. 24 గంటల్లో ఇంటింటికి వెళ్ళి పూర్తిచేసి, పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ జాతీయ జనగణన ప్రక్రియలో అత్యంత కీలకమైన హౌస్ లిస్టింగు జనగణన ప్రక్రియను వెంటనే నూరుశాతం పూర్తిచెయ్యాలని ఆదేశించారు. జనగణన నుండి ఏఒక్కరూ మిస్ కాకుండా అందరినీ సమగ్రంగా నమోదు చెయ్యాలని, మరణాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి పేర్లను తొలగించాలని అన్నారు. మండల



స్థాయి అధికారులు, సిబ్బంది చొరవచూపి వెంటనే పూర్తిచెయ్యాలని ఆదేశించారు. ?జనగణన అనేది దేశభవిష్యత్తు ప్రణాళికలకు దిక్సూచి వంటిదని అన్నారు. ఇందులో ఎలాంటి అలసత్వానికి తావు ఇవ్వరాదని, 24 గంటల్లో అన్ని గృహాలు నమోదు ప్రక్రియను పూర్తిచెయ్యాలని అన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు ఎప్పటికప్పుడు డేటాను ఆన్లైన్లో నమోదు చెయ్యాలని, మండల అధికారులు ప్రగతిని పర్యవేక్షించాలని అన్నారు. జనగణన సిబ్బంది తమ ఇంటికి వచ్చినప్పుడు ప్రజలు సరైన సమాచారం అందించి సహకరించాలని కోరారు. తప్పుడు సమాచారం ఇవ్వడం గాని, వివరాలు దాచడం గాని చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ?లక్ష్యాలను సకాలంలో చేరుకోని వారిపై, విధుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై నిబంధనలు ప్రకారం కఠినచర్యలు తప్పవని జిల్లా కలెక్టరు హెచ్చరించారు.?ఈ కార్యక్రమంలో ఆర్డీవో కె.లక్ష్మీప్రసన్న, స్పెషల్ డిప్యూటీ కలెక్టరు కె.భాస్కర్, జిల్లా స్వర్ణగ్రామ, స్వర్ణవార్డు అధికారి జి.వెంకటనాయుడు, తహశీల్దారు యస్.డి.భ్రమరాంబ, యంపిడివో టి.నాగేంద్రకుమార్, డిప్యూటీ యంపిడివో లు షేక్ మీరా షరీఫ్, కె.రత్నాకరరావు, పంచాయతీ కార్యదర్శి బి.పవన్ హరీష్, సంబంధిత అధికారులు, స్వర్ణగ్రామ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

# విత్తన గుళికల కార్యక్రమం విజయవంతం

గాయత్రి న్యూస్ ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



ద్వారకాతిరుమల మండలం గొల్లగూడెం మరియు నాగులపల్లి గ్రామాలలో బుధవారం ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజరు బి.వెంకటేష్ ఆదేశాలు మేరకు డివిజనల్ ఇన్చార్జి ఎన్ ఎన్ ఏ అంబికా, ఎం.టి.ఓ. గోపాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విత్తన గుళికల (సీడ్ పెలెటైజేషన్) కార్యక్రమం నిర్వహించారు. అలాగే భీమడోలు ఆర్ ఎస్ కె వద్ద మండల వ్యవసాయ అధికారి ఉష, ఏఈఓ పీహెచ్ ఏ సిబ్బంది రైతులతో కలిసి విత్తన గుళికల తయారీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుత ఎల్ నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షాలు అనిశ్చిత పరిస్థితులను రైతులు ఎలా ఎదుర్కోవాలో అవగాహన కల్పించారు. అధికారులు మాట్లాడుతూ విత్తన గుళికలు సుమారు ఆరునెలలు పాటు సురక్షితంగా నిల్వ ఉండటమే కాకుండా, భూమి 365 రోజులు జీవవైవిధ్య పంటలతో కప్పబడి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడతాయని వివరించారు. ఈ విధానం ప్రధాన పంటలకు అవసరమైన పోషకాలను అందించి భూసారాన్ని మెరుగుపరుస్తుందని తెలిపారు. రైతులు 25 రకాలు నవధాన్యాలు విత్తనాలను భూమిలో చల్లడం ద్వారా భూసారం పెరగడంతో పాటు సూక్ష్మజీవులకు ఎలాంటి హాని కలగకుండా పంట వైవిధ్యం అభివృద్ధి చెందుతుందని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉష, ఎన్ఎఫ్ఏ అంబికా, ఎం.టి.గోపాల కృష్ణమూర్తి, రెండు మండలాలు రైతు సాధికార సంస్థ ఫీల్డ్ లెవల్ క్యాడరు సభ్యులు మరియు రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపేట నియోజకవర్గం టిడిపి అబ్జర్వర్ గా కన్నబాబు



గాయత్రి న్యూస్
గోకవరం క్లస్టర్ వన్ ఇన్చార్జ్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి కన్నబాబు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని కొత్తపేట నియోజకవర్గానికి టిడిపి అబ్జర్వర్ గా నియమితులయ్యారు.కేంద్ర పార్టీ ఆదేశానుశారం కన్నబాబు బాధ్యతలను స్వీకరించి కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావును మర్యాదపరంగా కలిశారు. ఇందులో భాగంగా కొత్తపేట నియోజవర్గంలోని మహానాడు కార్యక్రమాలను కన్నబాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ తెలుగువాడు ఆత్మగౌరవం చాటిన పార్టీ తెలుగుదేశమేనని పేదవానికి కూడు, గూడు ,గుడ్డ నినాదంతో పార్టీ స్థాపించిన అతి తక్కువ కాలంలోనే అధికారం చేపట్టిన ఘనత టిడిపికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారధ్యంలో రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందన్నారు. టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ ,మంత్రివర్యులు నారా లోకేష్ ఆధ్వర్యంలో యువతకు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తెలుగువారికి ప్రత్యేక గుర్తింపు ఉండేలా కృషి చేస్తున్నారన్నారు. భవిష్యత్తును ముందుగా చూసే విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడని కన్నబాబు అన్నారు. జగ్గంపేట శాసనసభ్యులు, టిటిడి బోర్డు మెంబర్, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ సారధ్యంలో జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి పదంలో ముందుకు సాగుతుందన్నారు. వీరందరి నాయకత్వంలో పనిచేయడానికి ఎంతో గర్వంగా ఉందని కన్నబాబు తెలిపారు.

# క్వారీ గుంతలో పడి బాలుడి మృతి..

గాయత్రి న్యూస్
గుంటూరు జిల్లా,రూరల్ మండలం నాయుడుపేటలో విషాద ఘటన చోటుచేసుకుంది. ఆటలాడుకుంటూ వెళ్లిన ఆనంద్ (6) అనే బాలుడు ప్రమాదవశాత్తు



మైనింగ్ క్వారీ గుంతలో పడి మృతి చెందాడు. ఒంగోలు నుంచి వచ్చిన కుటుంబం బంధువుల ఇంట్లో పుట్టినరోజు వేడుకలకు హాజరైన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. సుమారు 70 అడుగుల లోతున్న గుంతలో బాలుడు పడిపోవడంతో స్థానికులు రక్షించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి...

# ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం



గాయత్రి న్యూస్
నందిగామ పట్టణం పాత బస్టాండ్ ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ లో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించిన యాజమాన్యంలి సాంఘిక సేవ కార్యక్రమాలలో భాగంగా ఉచిత మజ్జిగ పంపిణీ చేపట్టారు. వేసవి సెలవులు కావటంతో ప్రయాణాలు చేస్తున్న వృద్దులు, చిన్నారులకు వేసవి తాపం నుండి ఉపశమనం అందించటానికి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ యాజమాన్యం వారి సౌకర్యం తో వందలమంది ప్రయాణికులకు, వృద్దులకు ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ పంపిణీని రోహిణి కార్తె ఎండల తాకిడి తగ్గేవరకు పంపిణి చేస్తాం అని ఇండియన్ ఆయిల్ బంక్ యజమాన్యం వారి మిత్రబృందం సహాయంతో అందించారు అని ఇండియన్ ఆయిల్ బంక్ అధినేత తెలియ జేష్యరు

# మల్లిశాల 4వ క్లస్టర్ లో డిజిటల్ మహానాడు ఘనంగా నిర్వహణ

**– ముఖ్యఅతిథిగా జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ హాజరు**



గాయత్రి న్యూస్
జగ్గంపేట మండలం మల్లిశాల 4వ క్లస్టర్ డిజిటల్ మహానాడు 2026 వేడుకలు మంగళవారం రాజపూడి చెల్లా నాగేశ్వరరావు ఫంక్షన్ హాల్లో అత్యంత వైభవంగా జరిగాయి. క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత జ్యోతుల నవీన్ టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ప్రత్యక్ష ప్రసారమైన చంద్రబాబు ప్రసంగాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి వీక్షించారు.మహానాడుపై జ్యోతుల నవీన్ కీలక వ్యాఖ్యలు ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ “మహానాడు అంటే తెలుగుదేశం పార్టీకి పండుగ. కార్యకర్తల శక్తిని ప్రపంచానికి చాటే వేదిక ఇది. డిజిటల్ మహానాడు ద్వారా ప్రతి గ్రామంలోని కార్యకర్తను నేరుగా అధినేతతో అనుసంధానం చేస్తున్నాం. ఎన్టీఆర్ ఆశయ సాధనకు, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి. వర్కింగ్ ప్రెసిడెంట్ యువనేత నారా లోకేష్ ఆధ్వర్యంలోరాబోయే రోజుల్లో టిడిపి గెలుపు చారిత్రాత్మకం గా ముందుకు సాగేలా ఈ డిజిటల్ మహానాడు బాటలు వేసింది” అని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి క్లస్టర్ వ్యవస్థ కీలకమని, ప్రతి ఇంటికి టిడిపి సిద్ధాంతాలను తీసుకెళ్లాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రేఖా బుల్లి రాజు, రాజపూడి సొసైటీ చైర్మన్ ఉప్పలపాటి బుల్లెబ్బు, కో క్లస్టర్ ఇంచార్జ్ కొల్లు రామకృష్ణ,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి సర్వసిద్ధి లక్ష్మణరావు యూనిట్ ఇన్చార్జులు వెలిశెట్టి శ్రీనివాసరావు, కేసినిడి శ్రీనివాసరావు, ముంద్రు ఎర్రబాబు , గల్లా శ్రీను, చల్లా రాము, కమ్మిల వెంకన్నకాపు, పొట్రు కృష్ణ, పొట్రు రాముడు, వల్లెపు అన్నవరం, దాసరి త్రిమూర్తులుపాల్గొన్నారు. మల్లిశాల, వెంగయ్యమ్మపురం, రాజపూడి, కృష్ణాపురం, గోవిందపురం, మన్యంవారిపాలెం, సీతారామపురం, జె.కొత్తూరు గ్రామాల నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై డిజిటల్ మహానాడును విజయవంతం చేశారు. క్లస్టర్ ఇంచార్జ్ పైడిపాల సూరిబాబు ఆధ్వర్యంలో ఏర్పాట్లు ఘనంగా జరిగాయి.

# క్రిస్టియన్, ముస్లిం మైనార్టీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలి

**– హక్కుల సాధనకు పోరాటాలే శరణ్యం**
**– దళిత ఐక్యవేదిక మహా గర్జనలో రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా**




గాయత్రి న్యూస్
ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా క్రిస్టియన్ మరియు ముస్లిం మైనార్టీలు రాజ్యాధికారం సాధించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు రాష్ట్ర అహలే సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా. బుధవారం నాడు విజయవాడ సుజన కన్వెన్షన్ సెంటర్ లో దళిత ఐక్యవేదిక మహాగర్జనలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ క్రిస్టియన్ మైనార్టీలు దళితులు, ముస్లింలు తమ హక్కులు సాధించేందుకు పోరాటం చేయాలని తెలిపారు. కేవలం ఒక రకమైన చులకన భావంతో కొందరు రాక్షస ప్రవర్తనతో మాత్రమే దళితులు, క్రిస్టియన్లు, ముస్లింలపై దాడులు జరుగుతున్నాయని, హిందువులకు వీరిపై ఎలాంటి ద్వేషం లేదని అన్నారు. నిజంగా ఇస్లాం క్రిస్టియన్లను ద్వేషించే వారు అయితే వాళ్ల పిల్లలను క్రిస్టియన్ దేశాలైన అమెరికా, లండన్, ఇటలీ, ఇస్లాం దేశాలైన సౌదీ, కువైట్ దేశాలలో చదువులు ఉద్యోగాలు వ్యాపారాలు ఎలా కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు? దళితులు, ముస్లింలు శార్వాణిలు, షూట్లు ధరించడంతో కొంతమంది భయపడి ఎస్సీ హోదా లేకుండా చేసేందుకు మతం ముసుగులో డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. దళితులు ఎస్సీ హోదా కాకుండా రాబోయే కాలంలో రాజ్యాధికారం చేపట్టే అవకాశాలు ఉన్నాయన్నారు. క్రిస్టియన్లు, ముస్లింలు అన్నదమ్ములని, క్రిస్టియన్లు కష్టంలో ఉన్నప్పుడు సోదరులైన ముస్లింలు అండగా ఉండటం తమ బాధ్యత అన్నారు. క్రిస్టియన్ల హక్కుల సాధనకు నిర్వహించే పోరాటాలకు తాము పూర్తి మద్దతు ప్రకటించి అండగా నిలుస్తామని చెప్పారు.

# జగ్గంపేట నియోజకవర్గంలో డిజిటల్ మహానాడు వైభవం

**– ఎల్ఈడీ స్క్రీన్లపై వర్చువల్ గా వీక్షించిన జ్యోతుల నవీన్**

గాయత్రి న్యూస్
తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు 2026 కార్యక్రమంలో భాగంగా జగ్గంపేట మండలం ఇర్రిపాక గ్రామంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ స్వగృహంలో డిజిటల్ మహానాడు అత్యంత వైభవంగా నిర్వహించబడింది. క్లస్టర్ 8 ఇన్చార్జి బస్వా చిన్నబాబు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సతీమణి మణిమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.తొలుత టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ డాక్టర్ నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై డిజిటల్ మహానాడును వర్చువల్ గా వీక్షించారు. కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా కార్యక్రమాన్ని తిలకించారు.అనంతరం జగ్గంపేట క్షత్రియ పరిషత్ లో నిర్వహించిన జగ్గంపేట క్లస్టర్ ఇన్చార్జి దేవరపల్లి మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ మహానాడు, జగ్గంపేట లక్ష్మీ గణపతి ఫంక్షన్ హాల్ లో కిర్లంపూడి 10 క్లస్టర్ ఇంచార్జ్ పాఠం శెట్టి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన డిజిటల్ మహానాడు, గండేపల్లి మండలం ఉప్పలపాడు క్లస్టర్ ఇన్చార్జి అడబాల భాస్కరరావు ఆధ్వర్యంలో జెడ్ రాగంపేట పరిణయ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన డిజిటల్ మహానాడు లోను ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నవీన్ మాట్లాడుతూ, ఇంధన పొదుపు లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా 1883 క్లస్టర్లలో డిజిటల్ మహానాడు నిర్వహిస్తున్నామని తెలిపారు. జగ్గంపేట నియోజకవర్గంలోనే 12 క్లస్టర్లలో ఈ కార్యక్రమం విజయవంతంగా సాగుతోందని పేర్కొన్నారు. వాహనాల రాకపోకలు తగ్గినప్పటికీ కార్యకర్తల్లో ఉత్సాహం ఏమాత్రం తగ్గలేదని, డిజిటల్ విధానం ద్వారా ఇంధనంతో పాటు సమయం, వ్యయం కూడా ఆదా అవుతోందని వివరించారు.తెలుగుదేశం పార్టీ లక్ష్యాలు, రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకు చేర్చడమే మహానాడు ప్రధాన




ఉద్దేశమని స్పష్టం చేశారు. సాంకేతికతను వినియోగించుకుని పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా టిడిపి కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జిలు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముదిరిన డాన్-3 వివాదం

## రణ్‌వీర్‌పై సినీ ఎంప్లాయిస్ నిషేధం

'ధురంధర్' రెండు భాగాలతో సూపర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుని కొన్ని రోజులుగా టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు రణ్‌వీర్. ఇప్పుడు ఆయన మరోసారి వార్తల్లో నిలిచారు. కొన్ని రోజులుగా చర్చనీయాంశమైన 'డాన్ 3' వివాదం ఇప్పుడు ముదిరింది. ఏకంగా ఈ అగ్ర హీరోపై బ్యాన్ విధించే పరిస్థితికి వచ్చింది. అమితాబ్ బచ్చన్, షారుఖ్ ఖాన్ తర్వాత డాన్ పాత్రను పోషించాల్సిన రణ్‌వీర్‌పై 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) మూడేళ్ల పాటు నిషేధం విధించింది. దీంతో ఆయన హాట్ టాపిక్‌గా మారారు. 2023లో ఫర్హాన్ అక్తర్ ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్ హీరోగా 'డాన్ 3'ని అధికారికంగా ప్రకటించింది. అప్పుడే ప్రమోషనల్ వీడియోను విడుదల చేసి పెద్ద సంచలనం సృష్టించింది. అయితే సినిమా తీయడంలో




కొంత ఆలస్యం కావడం.. స్క్రిప్ట్‌లో సమస్యలు తలెత్తడంతో రణ్‌వీర్ ఈ చిత్రం నుంచి వైదొలిగినట్లు వార్తలు వచ్చాయి. రణ్‌వీర్ తన డాన్ పాత్రను మరింత డార్క్, హింసాత్మకంగా చూపించాలని కోరుకున్నట్టు బాలీవుడ్ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఫర్హాన్ అక్తర్ పాత్రను మార్చడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య విభేదాలు వచ్చాయి. షూటింగ్ షెడ్యూల్ ఆలస్యం కావడంతో రణ్‌వీర్ అసహనం వ్యక్తంచేస్తూ ఈ ప్రాజెక్ట్ నుంచి వైదొలిగినట్లు బాలీవుడ్ కథనాలు పేర్కొన్నాయి. 'డాన్ 3' నుంచి తాను వైదొలిగిన తర్వాత దర్శకుడు ఫర్హాన్ అక్తర్‌కు రణ్‌వీర్ రూ.10కోట్లు ఆఫర్ చేసినట్లు వార్తలు వచ్చాయి. అలాగే తన తదుపరి చిత్రం 'ప్రళయ్'లో అక్తర్ నిర్మాణసంస్థకు వాటా ఇవ్వడానికి కూడా ఈ హీరో అంగీకరించారని టాక్ వినిపించింది. అయితే దీనిపై ఎవరూ అధికారికంగా స్పందించలేదు. ఒకవైపు ఈ వార్తలు వస్తోన్న తరుణంలోనే ఈ వివాదంపై ఎక్సెల్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రణ్‌వీర్ సింగ్‌పై రూ.45 కోట్ల నష్టపరిహారం కోరుతూ లీగల్ నోటీసు జారీ చేసింది. దీంతో 'ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్'(ఎఫ్‌డబ్ల్యూఐసీఈ) రణ్‌వీర్‌పై మూడేళ్ల నిషేధం విధించింది. రణ్‌వీర్ చర్చలకు సహకరించలేదని, నిర్మాతలు నష్టపోయిన రూ.45 కోట్ల ప్రీ ప్రొడక్షన్ నష్టపరిహారం విషయంలో నిర్మాణ సంస్థతో ఉన్న వివాదాన్ని పరిష్కరించుకునే వరకు ఆయనతో కలిసి పనిచేయవద్దని పరిశ్రమని ఆదేశిస్తూ 'ఎఫ్‌డబ్ల్యూఐసీఈ' ప్రకటన జారీ చేసింది. సినిమాలు కీలక దశలో ఉన్నప్పుడు సీనియర్‌లు, స్టార్‌లు ప్రాజెక్ట్‌ల నుంచి వైదొలగడం వినోద పరిశ్రమ స్థిరత్వానికి.. పని వాతావరణానికి తీవ్ర ముప్పును కలిగిస్తుందని ఎఫ్‌డబ్ల్యూఐసీఈ పేర్కొంది. అయితే, ఇది ప్రభుత్వం విధించిన నిషేధం కాకపోవడంతో రణ్‌వీర్‌పై పెద్దగా ప్రభావం పడదని సినీవర్గాలు భావిస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంపై రణ్‌వీర్ టీమ్ స్పందించింది. 'ఆయన తన వృత్తిని ఎంతో గౌరవిస్తారు. 'డాన్ 3' విషయంలో జరుగుతోన్న పరిణామాలపై ఆయన స్పందించకపోవడానికి కారణం ఇదే. ఊహాగానాలకు ఆజ్యం పోయడం ఆయనకు ఇష్టం లేదు' అని టీమ్ పేర్కొంది. డాన్ 3లో భాగమైన ప్రతిఒక్కరినీ ఆయన ఎంతో గౌరవిస్తారని తెలిపింది. ఈ బ్యాన్ ఆయన భవిష్యత్ ప్రాజెక్టులపై ఎంత ప్రభావం చూపుతుందనేది ఆసక్తిగా మారింది.

# చెన్నై లవ్‌స్టోరీ నుంచి నిను వదలనే

## ..సెకండ్ సింగిల్ విడుదల




నిమిషమైనా నిను వదలనే.. అంటూ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ క్రియేట్ చేశారు మణిశర్మ. కిరణ్ అబ్బవరం ప్రధానపాత్రలో రవి నంబూరి దర్శకత్వంలో రానున్న చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. తాజాగా ఈసినిమా నుంచి సెకండ్ సింగిల్‌ను టీమ్ విడుదల చేసింది. 'నను నేను వదిలినా.. నిను వదలనే..' అంటూ సాగే లిరిక్స్ అనంత్ శ్రీరామ్ అందించగా.. జావెద్ అలీ తన గాత్రంతో మరోస్థాయికి తీసుకెళ్లారు. యూత్‌కు కనెక్ట్ అయ్యేలా ఉన్న ఈ పాటను తీర్చిదిద్దారు. తెలుగు సినీ పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంటున్న యువ నటి శ్రీ గౌరి ప్రియ. వరుసగా విభిన్న పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న ఈ తెలుగమ్మాయి ప్రస్తుతం హీరో కిరణ్ అబ్బవరంతో కలిసి 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రంలో నటిస్తోంది. తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన 'వదలనే' పాట లాంచ్ ఈవెంట్‌లో శ్రీ గౌరి ప్రియ చేసిన వ్యాఖ్యలు అందరినీ భావోద్వేగానికి గురి చేశాయి. ఈ పాటలోని లిరిక్స్‌ను ఎవరికి అంకితం చేస్తారని ప్రశ్నించగా, శ్రీ గౌరి ప్రియ సమాధానం ఇస్తూ ఒక్కసారిగా భావోద్వేగానికి లోనైంది. నిజంగా చెప్పాలంటే మా అమ్మ నన్ను వదిలేసి మూడేళ్లు అయింది. కానీ తను నన్ను అసలు వదల్లేదు. నేను కూడా తనను ఎప్పటికీ వదలను. ఈ విషయం తనకు తెలుసు, నాకు తెలుసు. ఈ పాటలోని లైన్స్‌ను మా అమ్మకే అంకితం చేస్తున్నాను' అని చెప్పింది. ఆమె మాటలు విన్న వెంటనే కార్యక్రమంలో ఉన్నవారు కొద్దిసేపు నిశ్శబ్దంగా మారిపోయారు. సోషల్ మీడియాలో ఈ వీడియో వేగంగా వైరల్ అవుతోంది. మూడేళ్ల క్రితం శ్రీ గౌరి ప్రియ తల్లి వసుంధర క్యాన్సర్ కారణంగా మరణించారు. తల్లితో తనకు చాలా ఆత్మీయ అనుబంధం ఉండేదని గౌరి ప్రియ పలు సందర్భాల్లో వెల్లడించింది. ఆమెను కేవలం తల్లిగానే కాకుండా ఒక మంచి స్నేహితురాలిగా భావించేదని చెప్పింది. తల్లి మరణంతో కొంతకాలం తీవ్ర మానసిక వేదనకు గురైన ఆమె, ఆ తర్వాత మళ్లీ తన కెరీర్‌పై దృష్టి పెట్టింది. హీరో కిరణ్ అబ్బవరం ప్రధాన పాత్రలో నటిస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహిస్తున్నారు. సంగీత దర్శకుడు మణిశర్మ స్వరాలు అందిస్తున్నారు.



# బుచ్చిబాబు కోసం పెద్దిలో నటించా: దివ్యేందు

'పెద్ది' డైరెక్టర్ బుచ్చిబాబుపై ప్రశంసలు కురిపించారు బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ. ఆయన కోసమైనా 'పెద్ది' చేయాలని అనుకున్నట్లు చెప్పారు. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. ఇందులో దివ్యేందు శర్మ కీలక పాత్రలో నటించారు. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ నేపథ్యంలో ప్రచారంలో భాగంగా దివ్యేందు ఇంటర్వ్యూల్లో పాల్గొన్నారు. ఈ సినిమా అంగీకరించడానికి కారణం వెల్లడించారు. తాను ఉత్తరాఖండ్‌లో షూటింగ్‌లో ఉన్నప్పుడు ఈ చిత్ర బృందం నుంచి ఫోన్ వచ్చింది. వీలున్నప్పుడు వస్తాను అని చెప్పా. తర్వాత 'మిమ్మల్ని కలవాలి' అని బుచ్చిబాబు చాలా మెసేజ్‌లు పెట్టారు. దీంతో నేను ఆ షూట్ మధ్యలోనే ఆపేసి ఎంతోసేపు ప్రయాణించి చాలా కష్టపడి అక్కడినుంచి ఇక్కడికి వచ్చాను. బుచ్చిబాబును చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో ప్రేమతో వ్యవహరించారు. కళకు ఎంత గౌరవం ఇస్తారో చూశాను. నా పాత్రను వివరించేటప్పుడే నిర్ణయించుకున్నా. ఈ సినిమా ఎలా ఉన్నా బుచ్చిబాబు కోసం చేయాలి అని. వెంటనే ఓకే చేశా. ఆయన నన్ను అంత ప్రభావితం చేశారు' అని దివ్యేందు తెలిపారు. ఇక పెద్ది కథ గురించి మాట్లాడుతూ..'స్టోరీ చూసి షాక్ అయ్యాను. ఎంత గొప్పగా రాశారో అనుకున్నా. ఎన్నో ట్విస్ట్‌లు, గొప్ప గొప్ప పాత్రలు ఉన్నాయి. గుర్తింపు కోసం ఎంత యుద్ధమైనా చేయొచ్చని ఈ సినిమా చూశాక అర్థం అవుతుంది. 'పెద్ది' తన గుర్తింపు కోసం ఎంతో పోరాడతాడు. ఆ అంశం నాకు చాలా నచ్చిందని చెప్పారు.

# సిఎం విజయ్‌తో లోకేశ్ కనగరాజ్ భేటీ

తమిళనాడు రాజకీయాల్లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ, ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయం సాధించి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తమిళగ వెట్రి కజగం అధినేత, దళపతి విజయ్‌ను ప్రముఖ స్టార్ డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన విజయ్‌కు ఆయన స్వయంగా కలిసి తన హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా విజయ్‌తో దిగిన ఫొటోను షేర్ చేసిన లోకేష్ తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన విజయ్ అన్నా నీకు శుభాకాంక్షలు అంటూ లోకేష్ రాసుకోచ్చాడు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'మాస్టర్', 'లియో' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్‌లుగా నిలిచిన సంగతి తెలిసిందే. కేవలం దర్శకుడిగానే కాకుండా విజయ్‌తో లోకేష్‌కు ఎంతో కాలంగా మంచి ఆత్మీయ అనుబంధం ఉంది.



# 17 ఏళ్ల తర్వాత ఆ ప్రయోగం..

## 'పెద్ది' కథను మలుపు తిప్పే మ్యాచ్ అది!

దాదాపు 17 ఏళ్ల తర్వాత 'పెద్ది'లో దిల్లీ ఎపిసోడ్ కోసం మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించామని సినిమాటోగ్రాఫర్ రత్నవేలు తెలిపారు. రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందిన స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇది. జాన్వీకపూర్ కథానాయిక. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా సినిమాకు సంబంధించిన ఆసక్తికర విశేషాలను రత్నవేలు పంచుకున్నారు.




### అవన్నీ రీ క్రియేట్ చేశాం..

"పెద్ది' దాదాపు 40 ఏళ్ల క్రితం విజయనగరంలో జరిగే కథ. ఇప్పుడు పూర్తిగా మారిపోయింది. కానీ, ఒకప్పటి విజయనగరానికి ప్రేక్షకులను తీసుకెళ్లాలి. అదంతా ఒక ఊహా ప్రపంచం. రిఫరెన్స్ కోసం కొన్ని ఇమేజెస్ తీసుకుని, 'పెద్ది' కథను ఎలా చెప్పాలి? విజువల్‌గా ఎంత అందంగా క్రియేట్ చేయాలనే దానిపై చాలా పకడ్బందీగా వర్క్ చేశాం. క్లాక్ టవర్, వీధులు, షుగర్ ఫ్యాక్టరీ ఇలా ఒక్కో అంశాన్ని వరల్డ్ బిల్డింగ్ చేస్తూ వెళ్లాం. కొండ ప్రాంతాలు, అక్కడి ప్రజలు, వారి లైఫ్ స్టయిల్ ఇలా ప్రతిదీ చాలా సహజంగా ఉంటుంది"

### కథను మలుపు తిప్పే మ్యాచ్..

"పెద్ది'లో నాకు అత్యంత కష్టంగా అనిపించింది క్రికెట్ మ్యాచ్. ఇది స్పోర్ట్స్ బేస్డ్ సినిమా. కెమెరామెన్‌తో పాటు మొత్తం టీమ్ చాలా జాగ్రత్తగా ఉండాలి. సినిమాలో వచ్చే సెకండ్ క్రికెట్ మ్యాచ్ చాలా కీలకం. అది కేవలం మ్యాచ్ మాత్రమే కాదు, కథలోనే ఒక పెద్ద మలుపు. ఆ మ్యాచ్‌ను రాత్రిపూట షూట్ చేద్దామని బుచ్చిబాబు గారికి సూచించాను. 80లలో ఫ్లడ్‌లైట్ మ్యాచ్‌లు జరిగేవి. ఆ మూడ్ కోసం నైట్ షూట్ అయితే బాగుంటుందని అనిపించింది. ఆయనకు ఆ ఆలోచన నచ్చింది"

### హనుమంతుడి రెఫరెన్స్..

"అలాగే కుస్తీ పోటీలు కూడా మరో పెద్ద ఛాలెంజ్. ఒక గెటప్ అనుకున్న తర్వాత కాస్ట్యూమ్స్, బాడీ మార్చుకుంటే సరిపోతుంది. కానీ, ఇందులో రామ్ చరణ్ కుస్తీ విషయానికి వచ్చేసరికి తన బాడీలోని ప్రతి మజిల్‌పై వర్క్ చేశారు. ప్రతి మజిల్‌ను డెవలప్ చేసి, ఒక రియల్ పహిల్వాన్‌లా కనిపించారు. హనుమంతుడి రిఫరెన్స్‌తో వచ్చే ఒక సీక్వెన్స్ ఉంది. ఆ సీక్వెన్స్‌లో ప్రత్యేకమైన లైటింగ్ డిజైన్ చేశాను. అది మీరు థియేటర్‌లో చూసినప్పుడు గూస్‌బంప్స్ వస్తాయి"

### చివరి 30 నిమిషాలు ప్రేక్షకుడిని కదలిస్తుంది..

"ఈ సినిమా క్లైమాక్స్ కూడా చాలా ఛాలెంజింగ్. ఇప్పుడే దాని గురించి ఎక్కువ చెప్పకూడదు. అది ప్రేక్షకులకు కన్నుల పండుగలా ఉంటుంది. విజువల్ గ్రాండియర్‌తో పాటు ఎమోషనల్ హై కూడా ఉంటుంది. చివరి 30 నిమిషాలు సినిమా ప్రేక్షకులని కదిలిస్తుంది. చాలా ఎమోషనల్‌గా కనెక్ట్ అవుతారు. ఇందులో దిల్లీలో చిత్రీకరించిన సన్నివేశాలు నాకు చాలా ఫేవరెట్. అక్కడ నేను లైట్ లేకుండా షూట్ చేశాను. దాని కోసం ఫిల్మ్ నెగటివ్‌ను వాడాం. దాదాపు 17 ఏళ్ల తర్వాత మళ్లీ ఫిల్మ్ నెగటివ్‌ను ఉపయోగించాను. ఇప్పుడు ఉన్న డిజిటల్ కెమెరాలు అద్భుతమైన ఔట్‌పుట్ ఇస్తున్నప్పటికీ, ఒక రియల్ ఫీల్ కోసం వాడాం"

### మంచి యాక్షన్ థ్రిల్లర్ తీస్తా!

"నేను ఇండస్ట్రీలోకి వచ్చి దాదాపు 30 సంవత్సరాలు అయ్యింది. ఏడాదికి ఒక సినిమానే చేస్తాను. ఒక సినిమా కమిట్ అయితే అది పూర్తయ్యే వరకు వేరేవి చేయను. ఇప్పటికే మూడు కథలు రాశాను. మంచి ఎమోషన్‌తో కూడిన యాక్షన్ థ్రిల్లర్‌ను డైరెక్ట్ చేయాలనుకుంటున్నాను. అలాగే ప్రతి పాత్ర కూడా కథలో ఇంపార్టెంట్‌గా ఉండాలి. మా అబ్బాయి కూడా కెనడాలో సినిమాటోగ్రఫీ చదువుకున్నాడు. నాలాగే తనకూ సినిమాపై చాలా ప్యాషన్. 'పెద్ది'లో ఒక కుస్తీ ఫైట్ అద్భుతంగా షూట్ చేశాడు" అని అన్నారు.



# విశ్వంభర విడుదల తేదీపై అస్పష్టత

## మెగా ఫ్యాన్స్‌లో గందరగోళం

మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం వరుస సినిమాలతో ఫుల్ బిజీగా ఉన్నారు. మెగాస్టార్ అభిమానులను ఎక్కువగా కలవరపెడుతున్న విషయం మాత్రం 'విశ్వంభర' మూవీ గురించే. ఎందుకంటే ఈ ప్రాజెక్ట్ చాలా కాలం క్రితమే ప్రారంభమై, షూటింగ్ కూడా పూర్తయిన దశకు చేరుకున్నప్పటికీ.. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత రాకపోవడం అభిమానుల్లో అనుమానాలు పెంచుతోంది. దర్శకుడు వశిష్ట తెరకెక్కిస్తున్న 'విశ్వంభర' మెగాస్టార్ కెరీర్‌లో అత్యంత భారీ ఫాంటసీ చిత్రాల్లో ఒకటిగా రూపొందుతోంది. విజువల్ ఎఫెక్ట్స్, గ్రాండియర్ సెట్స్, భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే షూటింగ్ దాదాపు పూర్తయిందని వార్తలు వచ్చినప్పటికీ, సినిమా రిలీజ్ విషయంలో మాత్రం ఎలాంటి అధికారిక ప్రకటన లేకపోవడం అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. మొదట ఈ సినిమాను సమ్మర్ రిలీజ్‌గా తీసుకురానున్నట్లు ప్రచారం జరిగింది. అయితే ప్రస్తుతం పరిస్థితులు చూస్తుంటే ఆ ప్లాన్ అమలు అయ్యే అవకాశాలు కనిపించడం లేదు. సినిమా నుంచి పెద్దగా అప్‌డేట్లు కూడా లేకపోవడంతో సోషల్ మీడియాలో ఫ్యాన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 'విశ్వంభర' ఆలస్యానికి ప్రధాన కారణం విజువల్ ఎఫెక్ట్స్ పనులేనని టాక్ వినిపిస్తోంది. ఫాంటసీ జానర్ కావడంతో సినిమాకు భారీ స్థాయిలో అవసరం పడుతోంది. ముఖ్యంగా ఫాంటసీ జానర్‌లో వస్తున్న 'విశ్వంభర' పై మొదటి నుంచే ప్రత్యేక ఆసక్తి నెలకొంది. కానీ వరుసగా కొత్త ప్రాజెక్టులు ప్రారంభమవుతుండటం, 'విశ్వంభర'పై మాత్రం నిశ్శబ్దం కొనసాగడం ఫ్యాన్స్‌లో కొంత అసంతృప్తి పెంచుతోంది.

**GAYATHRI NEWS Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/26/A3646 .. Cell No - 7386045673 ..... Printed ESHAGNA SERVICE INDIA PRIVATE LIMITED SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.